నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR

కుందన్‌పల్లి బూడిద చెరువు నుంచి తరలుతున్న బూడిద లారీలు

బూడిద లారీ పక్కదారి?

- ఎన్టీపీసీ యాష్ రవాణాలో మరో భాగోతం
- ఖమ్మం నేషనల్ హైవే పేరిట దందా!
- ట్రాన్స్‌పోర్ట్ చార్జీ ఒక్కో లారీకి ₹50వేలు కట్టిస్తున్న యాజమాన్యం
- కుందన్‌పల్లి నుంచి నిత్యం 500 వరకు లారీల రవాణా
- 40శాతం వరకు లారీలు మధ్యలోనే బ్లాక్‌కు తరలింపు
- ఒక్కో లారీ ₹50వేల వరకు విక్రయం
- కోట్లు దండుకుంటున్న అక్రమార్కులు
- స్థానిక నాయకులు, అధికారులపై ఆరోపణలు

ఎన్టీపీసీ యాష్ రవాణాలో మరో దందా కలకలం రేపుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్లడమే కాదు, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రూ. లక్షలు కొల్లగొడుతున్నట్టు వెలుగులోకి వస్తున్నది. ఒక్కో లారీకి ₹50వేల రవాణా చార్జీలు భరించి మరి సంస్థ ఖమ్మం నేషనల్ హైవేకు ఉచితంగా సరఫరా చేస్తుండగా, ఇదే అదునుగా కొంత మంది పక్కదారి పట్టిస్తున్నట్టు సమాచారం అందుతున్నది. 40శాతం లారీలను బ్లాక్‌కు తరలించి, ఒక్కో బూడిద లారీ లోడ్ కెపాసిటీని బట్టి 30వేల నుంచి ₹50వేల వరకు విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ బాగోతంలో స్థానిక నాయకులు, అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. దందాను పట్టించుకునే వారు లేకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): బొగ్గు ఆధారిత ప్రాజెక్టు అయిన ఎన్టీపీసీలో బొగ్గును మండించిన తర్వాత వచ్చే బూడిద అంతర్గాం మండలం కుందన్‌పల్లి బూడిద చెరువులోకి చేరుతుంది. పైప్‌లైన్ ద్వారా ప్రతి రోజూ 11వేల మెట్రిక్ టన్నులు వస్తున్నది. చెరువులో బూడిద నిల్వలు పేరుకుపోతే కాలుష్యనియంత్రణ మండలి ఒక్కో టన్నుకు ₹వెయ్యి వరకు జరిమానా విధిస్తున్నది. దీంతో ఆ భారాన్ని తప్పించుకునేందుకు యాజమాన్యం కొన్నేళ్లుగా బూడిదను ఫ్రీగా అందజేస్తున్నది. ఖాళీ చేసేందుకు అవసరమైన రవాణా చార్జీలను సంస్థనే భరిస్తున్నది. నేషనల్ హైవేల నిర్మాణానికి వాడుకోవాలని కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పడంతో ఉచితంగా సరఫరా చేస్తున్నది. పని ప్రదేశాలకు తరలించేందుకు అవసరమైన రవాణా చార్జీలను చెల్లిస్తున్నది. అయితే ఇదే అదునుగా కొంత మంది దందాకు తెరతీసినట్టు తెలుస్తున్నది.

బ్లాకులో విక్రయం?

బూడిద తరలింపు కోసం ఎన్టీపీసీ ఏడాది కింద టెండర్లను పిలువగా, ఓ కంపెనీ పూర్తి స్థాయి అనుమతులను దక్కించుకున్నది. ఆ తర్వాత ఆ కంపెనీ భాగస్వామ్యంతో మరో ఐదు కంపెనీలు సబ్ లీజ్ తీసుకున్నాయి. అయితే ఇక్కడ జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి బూడిదను ఇవ్వడంతో పాటు దానిని ఖమ్మం నేషనల్ హైవే నిర్మాణం కోసం తరలించేందుకు ఎన్టీపీసీ రవాణా చార్జీలుగా ఒక్కో టన్నుకు ₹1250 చొప్పున అంటే ఒక్కో లారీకి దాదాపుగా ₹50వేల వరకూ చెల్లిస్తున్నది. గతేడాది మార్చి నుంచి ఈ బూడిద రవాణా కొనసాగుతున్నది. ప్రతిరోజూ దాదాపుగా 400 నుంచి 500 వరకు లారీలు ఇక్కడి నుంచి ఖమ్మం నేషనల్ హైవే నిర్మాణానికి బూడిదను తరలిస్తున్నాయి. అందుకుగానూ అనుమతులు దక్కించుకున్న కంపెనీలు వేబిల్లులను ఇస్తున్నాయి. అయితే ప్రతి రోజూ వచ్చే లారీల్లో దాదాపుగా 60శాతం మాత్రమే కుందన్‌పల్లి టూ ఖమ్మం నేషనల్ హైవేకు చేరుతుండగా, మిగతా 40శాతం లారీలు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, సిద్ధిపేట జిల్లాకు తీసుకువెళ్లి విక్రయిస్తూ.. ఎన్టీపీసీ రవాణా చార్జీలు ₹50వేల వరకు, బ్లాక్‌లో విక్రయించడం ద్వారా మరో ₹50వేల వరకు కొల్లగొడుతున్నారనే ఆరోపణలున్నాయి.

తీవ్ర విమర్శలు

బూడిద కొంత మందికి కాసుల వర్షం కురిపిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక నాయకులకు వాటాలు ముడుతున్నట్టు తెలుస్తుండగా, ఒక్కో ఓవర్ లోడ్ బూడిద లారీకి ₹8వేల వరకు అధికారులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు ఖమ్మం వెళ్లకుండా బ్లాక్‌లో విక్రయించే బూడిద లారీ ఎక్కడ దొరికినా అక్కడ వేలల్లో సెటిల్‌మెంట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే సమయంలో మిగిలిన లారీ యజమానులు సైతం ఒక్కో లారీకి నెలకు ₹8వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఇటీవల బసంత్‌నగర్‌కు చెందిన ఓ లారీ యజమాని అనిల్‌గౌడ్ పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇదంతా కండ్ల ముందే జరుగుతున్నా అటు పాలకులు గాని, అధికారులు గాని చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ సెంట్రల్ విజిలెన్స్ దృష్టి సారించాలనే డిమాండ్లు వ్యక్తమయ్యాయి.

నంబర్లు ప్లేట్లు, జీపీఎస్ మార్చి అక్రమాలు

ఎన్టీపీసీలో లారీలు బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం వెనుక కొందరు సెక్యూరిటీ అధికారులపైనా ఆరోపణలు వస్తున్నాయి. సీసీ కెమెరాల్లో రికార్డుకు ముందు, తర్వాత లారీల నంబరు ప్లేట్లు మార్చడం, జీపీఎస్‌ను మరో లారీలో పెట్టడం, ఒకే నంబర్‌పై ఒకే రోజు మూడు నాలుగు లారీలు తిప్పుతున్నట్టు తెలుస్తున్నది. ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణానికి ఇక్కడి నుంచి వెళ్లిన 500 లారీల్లో 250వరకు మాత్రమే చేరుతున్నట్టు తెలుస్తున్నది. హైవే అథారిటీ వారికి అనుమానం రాకుండా లారీల్లో స్థానిక మట్టిని, అక్కడి స్థానిక బూడిదను కలిపి రికార్డ్స్‌లో ఎక్కించి దోచుకుంటున్నట్టు తెలుస్తున్నది.

వేగురుపల్లిలో ఓ వైపు క్రికెట్ మ్యాచ్‌తో పాటు పెళ్లి వేడుకలు

పెండ్లి వేడుకల్లో లైవ్ మ్యాచ్

ఆసక్తిగా తిలకించిన బంధువులు

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 23 : ఇండియా–పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే స్పెషల్.. ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా ఒక్క బాల్ మిస్‌కాకుండా టీవీలకు అతుక్కుపోవాల్సిందే.. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం ఇండియా – పాకిస్థాన్ మ్యాచ్ ఉండడం.. మరోవైపు పెళ్లిళ్లు అధికంగా ఉండడంతో బంధువులు, మిత్రులు వస్తారో.. రారో అనుకుని.. వచ్చినా ఎక్కువ సమయం ఉంటారో.. లేదోనని పెళ్లివారు మండపాల్లో స్క్రీన్లు ఏర్పాటు చేసి మ్యాచ్‌ను లైవ్ టెలీకాస్ట్ చేశారు. మానకొండూర్ మండలం వేగురుపల్లి గ్రామంలో బత్తిని స్వరూప–వీరస్వామి గౌడ్ దంపతుల కూతురు వివాహం జరుగగా, అదే వేడుకల్లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో ఓ వైపు పెండ్లి తంతు, మరో వైపు క్రికెట్ మ్యాచ్‌ను స్క్రీన్ పై వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. హాజరైన బంధువులు, గ్రామస్తులు సైతం ఆసక్తిగా తిలకించారు.

రైతు భరోసా ఏదీ?

పూర్తి స్థాయిలో అందని పెట్టుబడి సాయం

రైతు భరోసా.. పరిహాసంలా మారింది. ఇప్పటికీ మూడెకరాల వరకు అందించినట్టు ప్రభుత్వం ప్రకటించినా, పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయం అందనట్టు తెలుస్తున్నది. భూ విస్తీర్ణం ఎక్కువగా ఉన్నా తక్కువగానే వేయగా, ఉన్న భూమి కన్నా పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఎక్కువ విస్తీర్ణం ఉంటే ఆయా సర్వే నంబర్లలో ఏ ఒక్కరికీ అందించలేదు. సాగు యోగ్యమైన భూమి అయినా రెండు మూడు సీజన్లలో సాగు చేయలేదని ఇవ్వడం లేదు. ఇలా రకరకాల కారణాలతో వేలాది మందికి సగం సగమే రైతు భరోసా ఇవ్వగా, అసలు రైతుల వివరాలు అందుబాటులో లేవని వేలాది మందిని పక్కన పెట్టేశారు. వివరాలు ఉన్న వేలాది మంది అన్నదాతలకు కూడా ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారు. ఇప్పటి వరకు మూడెకరాల వరకే ఇచ్చినట్టు చెబుతున్నా, ఇంకా ఎన్ని ఎకరాలకు ఇస్తారనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- మూడెకరాల వరకు అందించామన్న సర్కారు
- సగం సగమే జమవుతున్న రైతు భరోసా
- రకరకాల కారణాలతో ఎగనామం
- ఇంకా ఎన్ని ఎకరాలకు ఇస్తారో స్పష్టత కరువు
- కరీంనగర్ జిల్లాలో అందుబాటులో లేని 13,505 మంది రైతుల వివరాలు
- ట్రెజరీలో పెండింగ్ ఉన్న సంఖ్య 42,964
- అంతా గందరగోళం.. అన్నదాతల్లో ఆందోళన

కరీంనగర్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించేందుకు అధికారులు వ్యవసాయ యోగ్యమైన భూముల సర్వే చేశారు. కరీంనగర్ జిల్లాలో 5,476 ఎకరాలు సాగు యోగ్యత లేనివని తేల్చారు. మిగతా భూమికి రైతు భరోసా ఇవ్వొచ్చని ప్రభుత్వానికి నివేదించారు. ఎకరాకు ఏటా ₹12 వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ యాసంగి సీజన్‌లో 2,09,450 మంది రైతులకు ₹213.95 కోట్ల పెట్టుబడి సాయం అందించాలని జిల్లా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆ మేరకు రైతుల వివరాలు సేకరిస్తున్నారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు 1,95,945 మంది వివరాలు మాత్రమే అందుబాటులో ఉండగా, ఇంకా 13,505 మంది వివరాలు సేకరించాల్సి ఉన్నది. అధికారులు ఓవైపు రైతుల వివరాలు సేకరిస్తూనే.. మరోవైపు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న వారి వివరాలను ట్రెజరీకి పంపించారు. 1,81,661 మంది రైతుల ఖాతాల్లో ₹170.34 కోట్లు జమ చేయాలని పంపారు. ఇంకా 14,284 మందిని వదిలేశారు. అయితే అందులోనూ 1,38,697 మంది రైతులకే ₹101.36 కోట్లు జమ చేశారు. ట్రెజరీకి పంపిన వారిలో ఇంకా 42,964 మంది రైతులకు ₹68.98 కోట్లు జమ చేయాల్సి ఉంది. రైతు భరోసా ప్రారంభించి రోజులు గడుస్తున్నా పెట్టుబడి సహాయం అందక పోవడంతో రైతుల్లో అసహనం వ్యక్తమవుతున్నది.

సగం సగమే జమ

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా ఇచ్చామని ప్రకటించినప్పటికీ, కొందరు రైతులు తమ ఖాతాల్లో పడలేదని చెబుతున్నారు. కొందరికి తమకున్న విస్తీర్ణంలో పూర్తి స్థాయిలో జమ కాలేదని వాపోతున్నారు. దీనికి అధికారులు కొన్ని కారణాలు చెబుతున్నారు. అధికారులు సర్వే నిర్వహించిన సాగుయోగ్యమైన భూముల వివరాలను రీ సర్వే సెటిల్‌మెంట్ రిజిస్టార్ (ఆర్ఎస్ఆర్)లో నమోదు చేశారు. అందులో విస్తీర్ణం తక్కువ ఉండి, పట్టాదారు పాస్ పుస్తకంలో ఎక్కువున్న వారికి సాయం జమ కావడం లేదని తెలుస్తున్నది. కొంత భూమికి ఇచ్చి మరి కొంత భూమికి ఇవ్వడం లేదు. ఒక సర్వే నంబర్‌లో ఉన్న భూ విస్తీర్ణం కన్నా పట్టాదారు పాసు పుస్తకాల్లో ఎక్కువ విస్తీర్ణం ఉన్నా ఆయా సర్వే నంబర్లలో ఏ ఒక్కరికీ అందడం లేదు. క్రాప్ బుకింగ్ పోర్టల్‌ను కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. సాగు యోగ్యమైన భూమి అయినప్పటికీ రెండు మూడు సీజన్లలో పంటలు సాగు చేయడం లేదని క్రాప్ బుకింగ్ సర్వేలో తేలిన భూములకు కూడా ఇప్పుడు రైతు భరోసా ఇవ్వడం లేదు. ఇలాంటి రైతులు వేల సంఖ్యలోనే ఉన్నట్లు అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తున్నది. 16 వేల పైచిలుకు రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. నిజానికి వ్యవసాయ అధికారులు తేల్చిన సాగు యోగ్యంకాని భూములు 5,476 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తున్నది. కానీ, ఈ రకమైన కారణాలు చూపుతూ వేలాది మంది భూములకు రైతు భరోసా వర్తింపజేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో గందరగోళం

కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు కింద ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. కానీ, ఎన్ని ఎకరాల వరకు ఇస్తామనేది మాత్రం ఇంత వరకు చెప్పలేదు. ఇప్పటి వరకు కేవలం మూడు ఎకరాల వరకు ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా ఇచ్చినా.. మిగతా రైతులకు ఇస్తుందా.. లేదా..? అనే విషయంలో ఎక్కడా స్పష్టత ఇవ్వడం లేదు. ఈ విషయమై రైతులు ప్రశ్నిస్తుంటే అధికారులు కూడా ఏమీ చెప్పలేని పరిస్థితి ఉన్నది. గతంలో గుంట భూమి నుంచి మొదలుకుంటే ఎకరం వరకు, ఆ తర్వాత రెండెకరాలు, మూడెకరాలు ఇలా విడుతల వారీగా వారం వ్యవధిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు జమ చేసింది. కానీ, ఇప్పుడు ఏ రైతుకు వస్తుంది? ఎంత భూమి ఉంటే వస్తుంది? ప్రామాణికం ఏమిటనే విషయంలో స్పష్టత లేక రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నిజానికి అధికారులు ట్రెజరీకి పంపిన రైతులందరికీ రైతు భరోసా వస్తుందనే గ్యారంటీ లేకుండా పోయింది. ఇప్పటికే 42,964 మందికి సంబంధించిన రైతు భరోసా ట్రెజరీలో పెండింగ్‌లో ఉంది. అయితే, అందులో మూడెకరాలకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు ఎంత మంది ఉన్నారు? ఆ లోపు భూమి ఉన్న రైతులు ఎంత మంది ఉన్నారు? అనే విషయంలో స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో రైతు భరోసా విషయంలో రైతులు తీవ్రమైన గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

రేవంత్, బండి చీకటి దోస్తులు

- కేటీఆర్‌పై వారి విమర్శలు అర్థరహితం
- చార్ సౌ బీస్ హామీలతో సీఎం
- కులగణన పేరిట బీసీలను చీట్ చేసిండు
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఫైర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23: ప్రజల ముందుకువస్తే కొట్లాడినట్టు నటించి.. తెర చాటున చిల్లర మాటల రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ చీకటి దోస్తాన చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఆ ఇద్దరు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. చదువురాని, సంస్కారంలేని వ్యక్తులు అయినందునే నీచమైన భాషను వినియోగిస్తున్నారని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటివరుసలో నిలిచిందని కొనియాడారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి కనీసం పావలావంతు రుణమాఫీ కూడా చేయకుండా.. రైతులను మోసం చేశాడని ఆరోపించారు. కులగణన పేరిట బీసీలను మోసం చేసిన చీటర్ రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. సర్వేలో అగ్రవర్ణాల జనాభాను పెంచి.. బీసీల జనాభాను తగ్గించారని విమర్శించారు. సర్వే జాబితాను అన్ని సెంటర్లలో ప్రచురణ చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి మోసం చేసిన ప్రభుత్వాన్ని అదే రోజున ప్రజలే బొందపెడతారని జోస్యం చెప్పారు. రేవంత్ తరహాలోనే చదువు, సంస్కారం లేని వ్యక్తి బండి సంజయ్ అని మండిపడ్డారు. ప్రజా సమస్యల గురించి నిలదీయాల్సిన ఆయన.. కేటీఆర్‌ను ఉద్దేశించి చిల్లరగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై కొట్లాడితే ప్రజలే నిన్ను స్వాగతిస్తారని హితవు పలికారు. రైల్వే ప్రాజెక్టులు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, పరిశ్రమలకు రాయితీలు, తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదాపై బండి సంజయ్‌కి ఏ మాత్రం ధ్యాసలేదన్నారు. జిల్లాలో ఓ అధికారిని అడ్డుపెట్టుకుని స్థానిక నేతలు ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి ప్రజలపై తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సిరిసిల్లలో ఏదో జరుగుతుందన్నట్టు కల్పిత ప్రచారాలు చేశారని, అనేక మంది బీఆర్ఎస్ నాయకులు, రైతులపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపారన్నారు. మహేందర్‌రెడ్డికి ప్రభుత్వంలో ఉన్నవాళ్లంతా సన్నిహితులే అయినప్పుడు.. మల్కపేట ప్రాజెక్టు నుంచి నీళ్లు వదిలి ఎల్లారెడ్డిపేట మండలంలోని చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు ఓడించారనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. పాడి రైతులకు సంబంధించిన మిల్క్ చిల్లింగ్ సెంటర్‌ను మూసి వేయించారని, రైతులు ఎక్కడికక్కడ చేసిన ధర్నాలతో హంతకుడే సంతాపం తెలిపిన విధంగా కాంగ్రెస్ నాయకులే దగ్గరుండి తిరిగి తెరిపించారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా క్షేత్రంలో కేకే మహేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్‌కు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ బండ నర్సయ్య యాదవ్, కుంబాల మల్లారెడ్డి, గుండ్లపల్లి పూర్ణచందర్, సత్తార్, అడ్డగట్ల మురళి, వెంగళ శ్రీనివాస్‌పాల్గొన్నారు.